MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 152 | సోమవారం 28 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# శుద్ధి చేయని వ్యర్థాలు..



## నదీ జలాల నాణ్యతకు తిలోదకాలు

## నిర్దేశిత ప్రమాణాలు పాటించని యూనిట్లపై నియంత్రణ చర్యలు

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 28):**

ఆక్వా వ్యర్థాల కారణంగా ఉత్పన్నమయ్యే అనర్థాల నుంచి జలవనరులను పరిరక్షించే విధంగా నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రీ--ప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. జల వనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. శుద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, సాగర సంగమ ప్రాంతాలతోపాటు భూగర్భ జలాలు కూడా కాలుష్య బారినపడి, అది ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బ తీస్తుందని తెలిపారు. ఆక్వా ప్రాసెసింగ్, ప్రీ--ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి వెలువడుతున్న కాలుష్య ప్రభావం, నివారణ చర్యలపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 119 ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, 12 ఆక్వా ప్రీ--ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, ఉప ముఖ్యమంత్రివర్యుల సూచనల మేరకు ఈ యూనిట్లలో పర్యావరణ ప్రమాణాల అమలును నిర్ధారించేందుకు విస్తృత స్థాయిలో తనిఖీలు, నమూనాల సేకరణ, పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఏపీపీసీబీ అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు. 82 యూనిట్ల నుంచి నమూనాలు సేకరించగా, కొన్నింటిలో పీహెచ్ లెవల్స్, నీటిపై తేలియాడే ఘన వ్యర్థాలు, బీఓడీ వంటి కీలక ప్రమాణాల్లో మార్పులు గుర్తించారు. పర్యావరణ ప్రమాణాలు పాటించని 10 యూనిట్లకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, వివరణ - మిగతా2లో

# తుఫాన్ నష్టం..



**44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు**

**1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం**

**ఎన్యుమరేషన్‌లో వేగం పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు**

**(అంకుశం, అమరావతి, సెప్టెంబర్ 28):**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టంపై అందిన ప్రాథమిక నివేదికలు, ఇప్పటివరకు జరిగిన ఎన్యుమరేషన్ పురోగతిని మంత్రి సమీక్షించారు. తుఫాన్ ప్రభావంతో వివిధ జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టాన్ని పక్కాగా గుర్తించడం అత్యంత ముఖ్యమని - మిగతా2లో

## విజయవాడ ఉత్సవం--2.0ను

# విజయవంతం చేద్దాం

**విజయవాడ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశానికి చాటడమే లక్ష్యం -మంత్రి సత్య కుమార్ యాదవ్**



**అంకుశం ప్రతినిధి విజయవాడ సెప్టెంబర్ 28**

విజయవాడ నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడంతో పాటు పర్యాటక రంగం, స్థానిక వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటకశాఖ, సహకారం తో సొసైటీ ఫర్ వైబ్రేశీట్ విజయవాడ వారు నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవం--2.0కు కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా జరిగింది.గత ఏడాది ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో, ఈ ఏడాది మరింత వైభవంగా విజయవాడ ఉత్సవం--2.0 నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎంపీ,కేశినేని చిన్ని తెలిపారు. - మిగతా2లో

## రిజర్వాయర్ల నిర్వహణకు

# రూ.160 కోట్లు విడుదల

## -- మంత్రి నిమ్మల రామానాయుడు



**(అంకుశం, అమరావతి,సెప్టెంబరు 28):**

కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు సంబంధించి రూ.160 కోట్ల బిల్లులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై, దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి గాడిలో పెడుతోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన సాగునీటి సంఘాల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ధరించి రైతులకు కొండంత భరోసా కల్పించారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న పరిమిత జల వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో సాగునీటి సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతుల భాగస్వామ్యంతోనే సాగునీటి నిర్వహణ మరింత సమర్థవంతంగా జరుగుతుందనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఓఅండ్ఎం పనులకు కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. దీనివల్ల సాగునీటి వ్యవస్థ నిర్వహణ తీవ్రంగా దెబ్బతిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే ఓఅండ్ఎం పనుల కోసం రూ.1,320 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. కాలువల్లో పూడికతీత, లాకులు, షట్టర్లు, రోప్‌ల మరమ్మతులు వంటి అత్యవసర పనులకు గత ప్రభుత్వంలో నిధులు కేటాయించలేదని మంత్రి విమర్శించారు. చివరకు సాగునీటి - మిగతా2లో

## 15వేల మందికి

# పదోన్నతులు

**స్వర్ణగ్రామం, స్వర్ణవార్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు**

**మంత్రి బాల వీరాంజనేయస్వామి**



**(అంకుశం, అమరావతి,సెప్టెంబరు 28):**

రాష్ట్రంలోని స్వర్ణ గ్రామం,స్వర్ణవార్డు ఉద్యోగుల ఆచరణ సాధ్యమైన డిమాండ్లన్నిటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమం,స్వర్ణ గ్రామం,స్వర్ణ వార్డుల శాఖామాత్యులు డా.డోల బాల శ్రీ వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ లక్షా 23 వేల మందిని స్వర్ణ గ్రామం,వార్డుల్లో ఉద్యోగులుగా నియామకం చేసి పెద్దఎత్తున ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకుని వారి సర్వీసు రూల్స్ గురించి పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని - మిగతా2లో

## శ్రీ కాశీ విశ్వనాథుని సేవలో ఎమ్మెల్యే వేగుళ్ళ



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 28:** ప్రముఖ దివ్య పుణ్యక్షేత్రం కాశీ ధామంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కుటుంబ సమేతంగా పర్యటించారు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారిని, శ్రీ కాశీ విశాలాక్షి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ళతో పాటు పెద్దల్లుడు పి.సురేష్ కుమార్, కుమార్తె మణి మంజరి, మేనల్లుడు ఎం.జె.జె.ఎం.చౌదరి, మనుమరాలు సాయి స్వాతిక రెడ్డి స్వామివారి దర్శనం చేసుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే వేగుళ్ళకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

## భగత్ సింగ్ ను యువత ఆదర్శంగా తీసుకోవాలి...

**జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్...**




**అంకుశం న్యూస్,అనంతపురం, సెప్టెంబర్: 28** బ్రిటిష్ ప్రభుత్వం పై పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన విప్లవ వీరుడు భగత్ సింగ్ ను భగత్ సింగ్ ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ పిలునిచ్చారు.భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా నగరంలో ఆర్ట్స్ కాలేజీ వద్ద ఉన్న అయన విగ్రహానికి పూల మాల వేసి అమర్ యాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్ యాదవ్ మాట్లాడుతూ అవినీతి, అక్రమాల, అన్యాయాల పైన మాట్లాడాల్సిన యువత నేడు మత్తు పదార్థాలు బానిసలు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 18 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ వారితో పోరాడిన భగత్ సింగ్ ను భారతదేశ యువత ఆదర్శంగా తీసుకొని ఆయన మార్గదర్శకలు పాటించాలని యువతకు జిల్లా అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ అమర్ యాదవ్ తెలిపారు.

## తొలి ఉమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో విజయం సాధించిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ...

**అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ.....**




**అంకుశం న్యూస్, అనంతపురం,సెప్టెంబర్ : 28** మంగళగిరిలో జరిగిన తొలి ఉమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్ ) ఫైనల్ మ్యాచ్ లో విజయం సాధించిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ కు హృదయపూర్వక అభినందనలు. సమష్టి ప్రదర్శనతో టైటిల్‌ను సొంతం చేసుకున్న జట్టు సభ్యులకు శుభాకాంక్షలు. మహిళా క్రికెట్ ను ప్రోత్సహించేందుకు డబ్ల్యూ ఏపీఎల్ ను నిర్వహించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కృషి అభినందనీయం. ఈ లీగ్ ద్వారా మరెందరో ప్రతిభావంతులైన క్రీడాకారిణులు వెలుగులోకి రావాలని, ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెట్ జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని సింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ ఆకాంక్షిస్తున్నారూ.

## రిజర్వాయర్ల నిర్వహణకు రూ.160 కోట్లు విడుదల

-మొదటిపేజీ తరువాయి

వ్యవస్థలో అవసరమైన గ్రీజు పెట్టడం వంటి చిన్నపాటి నిర్వహణ పనులకు కూడా నిధులు అందని పరిస్థితి నెలకొందని తెలిపారు. కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచుతూ, సాగునీటి వ్యవస్థను నిరంతరం సమర్థవంతంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రైతుల ప్రయోజనాలు, సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## తుఫాన్ నష్టం..

-మొదటిపేజీ తరువాయి

మంత్రి స్పష్టం చేశారు. బాధిత రైతుల వివరాల నమోదులో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ప్రతి రైతు పంట నష్టాన్ని సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 89 మండలాలు, 351 గ్రామాల్లో ఉద్యానవన పంటలు ప్రభావితమయ్యాయి. మొత్తం 1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతినగా, 5,777 మంది రైతులు పంట నష్టానికి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 445 హెక్టార్లకు సంబంధించి 950 మంది రైతుల పంట నష్టం ఎన్యుమరేషన్‌ను పూర్తి చేశారు. ఇంకా 1,289 హెక్టార్లకు సంబంధించిన పంట నష్టం వివరాలను నమోదు చేయాల్సి ఉందని అధికారులు మంత్రికి వివరించారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 190 మండలాల్లోని 1,229 గ్రామాలు తుఫాన్ ప్రభావానికి గురయ్యాయి. మొత్తం 71,796 మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు గుర్తించగా, సుమారు 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 19 మండలాల్లోని 45 గ్రామాలకు చెందిన 726 మంది రైతుల పంట నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్‌ను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుత ఎన్యుమరేషన్ పురోగతిని సమీక్షించిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల జాయింట్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు సహా క్షేత్రస్థాయి సిబ్బంది పంట నష్టాల ఎన్యుమరేషన్‌ను అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంగా తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, ఏ ఒక్క బాధిత రైతు వివరాలు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. పంట నష్టం వివరాల నమోదులో పారదర్శకత, కచ్చితత్వం పాటించాలని, వాస్తవంగా నష్టపోయిన ప్రతి రైతు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, జిల్లాల వారీగా, పంటల వారీగా సమగ్ర నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## 15వేల మందికి పదోన్నతులు

-మొదటిపేజీ తరువాయి

విమర్శించారు.ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రత్యేకంగా ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించి అన్ని అంశాలను చర్చించి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నం చేయడం జరుగుతోందన్నారు.ఇప్పటికే 14వేల మందికి పదోన్నతులు కల్పించగా మున్సిపల్ పరిపాలన శాఖ కూడా ఇప్పటికే 800 మందికిపైగా పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు.రికార్డు అస్టిస్టెంట్ కేడర్లో నియామకమైన ఈ ఉద్యోగులు అందరికీ ప్రభుత్వంపై 150 కోట్ల రూ.లు అదనపు భారం పడుడున్నా ఆటోమేటిక్ అడ్వానట?స్మంట్ స్కీమ్ వర్తింప చేసేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.అదే విధంగా సెలవులకు సంబంధించి ఏప్రభుత్వ శాఖలోను లేని విధంగా ప్రత్యేక పోర్టల్ తీసుకువచ్చి 24 గంటల్లోగా సెలవు మంజూరు అయ్యే విధంగా చర్యలు చేపట్టినట్టు స్పష్టం చేశారు.ఈ ఉద్యోగులకు సంబంధించి న్యాయమైన ఆచరణ సాధ్యమైన డిమాండ్లన్నిటినీ పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కషి చేస్తోందని మంత్రి వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వ అనుమతి ఇవ్వకున్నా ఆదివారం విజయవాడలో ధర్నాకు సుమారు 2వేల మంది స్వర్ణ గ్రామం,స్వర్ణవార్డు ఉద్యోగులు పాల్గోవడం ఎంతమాత్రం సరికాదని మంత్రి పేర్కొన్నారు.ఆధర్నా సమయంలో విధుల్లో ఉన్న ఒక పోలీస్ ఇనట?స్పక్టర్ హఠాన్మరణం చాలా బాధాకరమైన విషయమని పేర్కొంటూ ఆసంఘటనను సోషల్ మీడియాలో వ్యంగ్యంగా కొంతమంది ఉద్యోగులు పోస్టులు పెట్టడం చాలా దురదష్టకరమని ఖండించారు.స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగుల ఆందోళనల వెనుక ఎవరున్నారో అర్థం కావడం లేదని వారి డిమాండ్లను మేం పరిష్కరిస్తుంటే ప్రభుత్వాన్ని నిందించడం సరికాదని మంత్రి పేర్కొన్నారు.సర్వీస్‌రూల్స్ లేకుండా గత ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే మేం సరి చేస్తున్నాం ప్రభుత్వంపై ఒత్తిడి చేసి డిమాండ్లు సాధిస్తామంటే సరికాదన్నారు.ప్రభుత్వంపై, ప్రభుత్వ అధినేతలపై ఇష్టానుసారం మాట్లాడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని గత ప్రభుత్వం నియమించిందని కదాని మేము వారిపై వివక్ష చూపించట్లేదని అన్నారు.జగన్ గత ఐదేళ్ల విధ్వంస పాలనతో రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఉద్యోగులకు చేయాల్సిన మంచి చేస్తున్నామని ఉద్యోగులు పరిస్థితి అర్థం చేసుకోవాలని అన్నారు.విధుల్లో సీఐ చనిపోతే చస్తే చావనీలే అంటూ కొందరు ఉద్యోగులు మానవత్వం లేకుండా మాట్లాడడం సరికాదని అన్నారు.ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా జగన్ వ్యవహరిస్తున్నారని ప్రజలు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోకుండా ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా జగన్ వ్యహరిస్తున్నారని విమర్శించారు.సీఐ మతిపై జగన్ ఎందుకు మాట్లాడలేదు ? జగన్ కి కనీస మానవత్యం లేదా ? నాడు జగన్ స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులకు ఎందుకు ప్రమోషన్ చానల్ క్రియేట్ చేయలేదు ? స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులు ఎప్పుడైనా తమ సమస్యలు ప్రభుత్వానికి ఎందుకు తీసుకురాలేదని అన్నారు. జిఓఎంస్ సంఖ్య 11 గురించి మంత్రి మట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ పనులకు సంబంధించి తమకు కేటాయించబడిన విధులను నిర్వహించాల్సి ఉంటుందని అంతేగాని ఆఉత్తర్వులు ఉద్యోగులపపై అదనపు భారాన్ని పెంచే ఉద్దేశ్యంతో జారీ చేసినవి కావని స్పష్టం చేశారు.ప్రభుత్వ పరిపాలన అవసరాల మేరకు ఉద్యోగులకు అప్పగించబడే విధులను వారు నిర్వహించాల్సి ఉంటుందని మంత్రి వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు.గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదు,రెగ్యులరైజేషన్‌ను మా ప్రభుత్వమే అమలు చేసిందని అన్నారు.నోషనల్ ఇంక్రిమెంట్స్ ఫైల్ ను ఇప్పటికే ఆర్థికశాఖకు పంపడం జరిగిందని అన్నారు.సిబ్బంది కొరత ఉన్నప్పుడు ఒకరికొకరు సేవలు అందించేలా డీసెంట్రలైజ్ చేశామని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి ఉద్యోగులకు మేలు చేయాలన్న తపన తప్ప వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం మా ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

## విజయవాడ ఉత్సవం--2.0ను విజయవంతం చేద్దాం



-మొదటిపేజీ తరువాయి

విజయవాడ ఉత్సవం నిర్వహణకు తాను చేసిన ఆలోచనకు ప్రభుత్వం, మంత్రులు, ప్రజలు, వివిధ వర్గాల నుంచి లభిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమం కాదని, విజయవాడ నగర బ్రాండ్‌ను మరింతగా పెంచడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఉపాధి అవకాశాలకు వేదికగా నిలవాలన్నదే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.దసరా సందర్భంగా విజయవాడకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, నగర ప్రజలు వారికి ఆతిథ్య భావంతో స్వాగతం పలకాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు, ప్రతి వ్యాపార సంస్థ దసరా, విజయవాడ ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించుకుని నగరాన్ని పండుగ వాతావరణంలోకి తీసుకురావాలని కోరారు.విజయవాడ ఉత్సవానికి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల ద్వారా స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కళాకారులు తదితర వర్గాలకు ఆదాయ, ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు.

**650 స్టాళ్లతో నేషనల్ సరస్ మేళా**

విజయవాడ పున్నమి ఘాట్‌లో తొలిసారిగా నేషనల్ సరస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీ చిన్ని తెలిపారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. మొత్తం 650 స్టాళ్లు ఏర్పాటు చేస్తుండగా, వాటిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘాలకు 230 స్టాళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో విజయవాడ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, మంత్రి కందుల దుర్గేష్, ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అందిస్తున్న సహకారానికి ఎంపీ చిన్ని కృతజ్ఞతలు తెలిపారు.

**విజయవాడ వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాం: మంత్రి సత్యకుమార్ యాదవ్**

విజయవాడకు చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ ఉత్సవాల ద్వారా నగర ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నామని తెలిపారు.విజయవాడ ఉత్సవాల ఆలోచన చేసి, ప్రజల భాగస్వామ్యంతో వాటిని నిర్వహించేందుకు చొరవ తీసుకున్న ఎంపీ కేశినేని చిన్ని అభినందనీయుడని అన్నారు. ఉత్సవాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు.దసరా సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విజయవాడ ఉత్సవాలు కేవలం సాంస్కృతిక కార్యక్రమం కాదని, పర్యాటక అభివృద్ధి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాల పెంపునకు వేదికగా నిలుస్తాయని చెప్పారు.మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబాలను బలోపేతం చేస్తుందని, మహిళా సంక్షేమ కార్యక్రమాలు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తున్నాయని మంత్రి తెలిపారు. విజయవాడ ఉత్సవాల స్ఫూర్తితో ధర్మవరంలో సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్ సత్య కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా,వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ కార్పొరేషన్ చైర్మన్లు పట్టాభివివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

## శుద్ధి చేయని వ్యర్థాలు..

-మొదటిపేజీ తరువాయి

ఇచ్చేందుకు, దిద్దుబాటు చర్యలకు రెండు వారాల గడువు ఇచ్చినట్టు తెలిపారు. నిరంతరాయంగా ఉల్లంఘనలకు పాల్పడే యూనిట్లపై పర్యావరణ చట్టాల మేరకు నియంత్రణ చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "కాలుష్యాన్ని మూలంలోనే గుర్తించి, నివారించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలు నదులు, కాలువలు, చెరువులు, సాగర సంగమ ప్రాంతాలు, భూగర్భ జలాలతో పాటు ఇతర జల వనరులపై ప్రతికూల ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవడం అత్యంత అవసరం. వ్యర్థ జలాల్లో బీఓడీ స్థాయిలు అధికంగా ఉంటే నీటిలో కరిగిన ఆక్సిజన్ శాతం తగ్గి జలచర జీవ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా మత్స్య సంపదపై ప్రతికూల

## వంద వినాయక సమితుల సేవలు విస్తరించాలి: ఎమ్మెల్యే కాలవ.



**అంకుశం న్యూస్ రాయదుర్గం రిపోర్టర్ సెప్టెంబర్ 28** రాయదుర్గం ప్రాంత అభివృద్ధికి తోడ్పడేలా వినాయక సేవా సమితులు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. సమాజ శ్రేయస్సు, ప్రజల సంక్షేమం, యువతలో సేవా దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. రాయదుర్గం పట్టణంలోని రుద్రయ్య శెట్టి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సోమవారం పట్టణంలో ఉత్సవాలు నిర్వహించిన వందకుపైగా వినాయక సేవా సమితుల సభ్యులతో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రాయదుర్గంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా ఉత్సవ సమితుల సభ్యులు నిర్వహించారని ఎమ్మెల్యే అభినందించారు. అందరూ పరస్పర సహకారంతో సేవాగుణంతో చక్కగా పని చేశారన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాల ద్వారా దైవభక్తితో పాటు స్నేహభావం పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా వారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై ఆయన సభ్యులతో చర్చించారు. వెనకబడ్డ రాయదుర్గం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం తరపున తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో ప్రజల భాగస్వామ్యం, స్వచ్ఛంద సంస్థలు, సేవా సమితుల సహకారం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. సామాజిక అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్యను ప్రోత్సహించడం, పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యం, సేవా కార్యక్రమాలు వంటి అంశాలపై వినాయక సేవా సమితులు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందన్నారు. సేవా సమితులు స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజలను భాగస్వాములను చేస్తే సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చన్నారు. రాయదుర్గం అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను కూడా ముందుకు తీసుకెళ్లే విధంగా సమితులు తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆకాంక్షించారు.

## బాధితులకు అడగగానే అండగా నిలిచే నాయకత్వం: -టీడీపీ నాయకుడు బాషా



**రాప్తాడు అంకుశం న్యూస్ సెప్టెంబర్ 28** ప్రజల కష్టాలను, అవసరాలను గుర్తించి అడిగిన వెంటనే స్పందించి అండగా నిలిచే నాయకత్వం మనకు ఉందని రాప్తాడు మండల చిన్మయనగర్ నివాసి లబ్ధిదారుడు బాషా కొనియాడారు. రాప్తాడు పర్యటనలో భాగంగా ఆయన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి తన పరిస్థితిని, దివ్యాంగుడుగా ఉన్న తనకు మోటార్ సైకిల్ అవసరాన్ని వివరించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత వెంటనే స్పందించారు. బాషా అవసరాన్ని అర్థం చేసుకుని, ఆయనకు తక్షణమే మోటార్ సైకిల్‌ను తెప్పించగా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గడుపూటి నారాయణస్వామి, రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, టిడిపి మండల కన్వీనర్ పంపు కొండప్ప సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు బాషా మాట్లాడుతూ... "నా అవసరాన్ని అర్థం చేసుకుని, అడిగిన వెంటనే స్పందించి మోటార్ సైకిల్ అందించిన టీడీపీ నాయకత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని భావోద్వేగంతో తెలిపారు. ప్రజల సమస్యల పట్ల త్వరితగతిన స్పందించే ఇటువంటి నాయకత్వం ఉండటం ఎంతో అభినందనీయమని స్థానికులు కొనియాడారు. పాల్గొన్నార

## ఘనంగా భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు....



**అంకుశం న్యూస్, రాయదుర్గం,సెప్టెంబర్:28** రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ నగేష్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావలి కోట్రేష్ మాట్లాడుతూ,భగత్ సింగ్ భారత స్వాతంత్ర్యోద్యమంలో యువతను బలంగా ప్రభావితం చేసిన గొప్ప విప్లవకారుడని కొనియాడారు.భగత్ సింగ్ 28 సెప్టెంబర్ 1907న పంజాబ్ లోని బంగా, లయల్పూర్ జిల్లాలో జన్మించారని, చిన్న వయసులోనే బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటంలోకి దిగి హెచ్ఎస్ఆర్ఏ లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 1929 అసెంబ్లీ బాంబు ఘటన, 23 మార్చి 1931న కేవలం 23 ఏళ్లకే రాజ్, సుఖ్‌దేవ్ లతో కలిసి ఉరితీయబడి అమరవీరుడైన విషయాన్ని గుర్తు చేశారు. భగత్ సింగ్ కు స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుండి విముక్తి మాత్రమే కాదు, దోపిడీ, అసమానతలు లేని సమాజ నిర్మాణమని, ఆయన జీవితం నేటి యువతకు ధైర్యం, ప్రశ్నించే తత్వం, పఠనాశీలతకు ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీనివాస్, ఎర్రన్న, గోవింద్,ఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్నాయకులు భాను ప్రకాష్, కుమార్ నాయక్, నవీన్, రాజు, తరుణ్, నందు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారని, ఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు తెలిపారు.

# అర్ధరాత్రి దొంగతనంగా దాత పేరు తీసేయడం దుర్మార్గం

**రాజకీయ కక్షలతో దాతలను అవమానిస్తే భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి ఎవరూ ముందుకు రారు**

**గొల్లలమామిడాడ ప్రజలకు ఎమ్మెల్యే తక్షణమే క్షమాపణ చెప్పాలి: మాజీ ఎమ్మెల్యే డిమాండ్**




**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 28:** గొల్లలమామిడాడ సూర్యనారాయణమూర్తి దేవాలయంపై ఉన్నటువంటి దాత పేరును రాత్రికి రాత్రే తొలగించడంపై అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పెద్దపూడి మండలం గొల్లలమామిడాడ గ్రామంలోని సూర్యనారాయణమూర్తి ఆలయంపై రథాన్ని, సూర్యదేవుని విగ్రహాన్ని చింతపండు వెంకటరెడ్డి (ద్వారంపూడి వెంకటరెడ్డి) తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించారని, ఆయన దాతృత్వానికి గుర్తుగా దానిపై పేరు రాశారని తెలిపారు. అలాగే గతంలో వారి సోదరుడు సుమారు కేజీకి పైగా బంగారంతో సూర్యదేవుడికి కిరీటాన్ని సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రథం, విగ్రహం గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో, రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ఏర్పాటు చేశారని, ఆ రోజుల్లో ఎలాంటి అభ్యంతరం చెప్పని నాయకులు, ఈ రోజు ఏ ఉద్దేశంతో తీసివేశారో సమాధానం చెప్పాలని అన్నారు.
ఇటీవల అర్ధరాత్రి వేళ దొంగతనంగా చింతపండు వెంకటరెడ్డి పేరును తొలగించేలా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన అనుచరులతో దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. పట్టపగలు చేస్తే ప్రజలు ఛీకొడతారనే ఉద్దేశంతోనే అర్ధరాత్రి వేళ నక్కి నక్కి తిరుగుతూ ఈ పనికి పాల్పడ్డారని, దీనికి సంబంధించిన వీడియోలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేకపోతే, రామకృష్ణారెడ్డి తక్షణమే తన అనుచరుడు చేసిన తప్పును బహిరంగంగా ఖండించి, గతంలో ఉన్న విధంగానే పేరును యథావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దాతను అవమానించిన సదరు వ్యక్తికి తిరిగి గౌరవప్రదమైన పదవి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.
ఇటువంటి దుర్మార్గమైన చర్యల వల్ల భవిష్యత్తులో ఏ దాత కూడా ముందుకు రాని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, దేవస్థానానికి సంబంధించిన ఒక అధికారితో రామకృష్ణారెడ్డి అనుచరుడు పచ్చి బూతులతో మాట్లాడిన ఆడియో రికార్డింగ్ కూడా తన వద్ద ఉందని, కానీ సభ్యత, సంస్కారం కొద్దీ దానిని బయటపెట్టడంలేదని తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఇప్పటికైనా తన తీరును మార్చుకుని, చేసిన తప్పుకు గొల్లలమామిడాడ గ్రామ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు.

# జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ కాంపిటీషన్‌కు 5 గ్రామాలు ఎంపిక

**రూ.1 కోటి గ్రాంట్ సాధించే అవకాశం**

**పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



**అంకుశం న్యూస్‌అనంతపురం, సెప్టెంబర్ 28 :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "పీఎం సూర్య ఘర్ పథకం" ద్వారా ప్రతి జిల్లాలో 5,000 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలను 'మోడల్ సోలార్ విలేజ్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్.ఈ, జెడ్పీ సీఈఓ, డీఆర్డీఏ పిడి, నెడ్క్యాప్ అధికారులు, ఎల్డీఎం, డిపిఓలతో మోడల్ సోలార్ విలేజ్ లలో పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష నిర్వహించారు.
– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్ కాంపిటీషన్‌కు జిల్లా పరిధిలోని 5 గ్రామాలు నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ గ్రామాలను ఈ పోటీ కోసం ఎంపిక చేశారన్నారు. ఈ రోజు నుండి రాబోయే 3 నెలల పాటు ఈ ఐదు గ్రామాల మధ్య 'సోలార్ కాంపిటీషన్' నిర్వహించబడుతుందని, పోటీ వ్యవధిలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఏ గ్రామంలో అయితే అత్యధికంగా సోలార్ రూఫ్‌టాప్ ఇన్స్టాలేషన్లు ఏర్పాటు చేసుకుంటారో, ఆ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం రూ. 1 కోటి రూపాయిల ప్రోత్సాహక నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఈ గ్రామాలలో రాబోయే 3 నెలల పాటు ఎవరు ఎక్కువ చేస్తారో నివేదిక తెప్పించుకోవాలని, నివేదిక ఆధారంగా ఎంఎన్ఆర్ఈ (మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెనేవబుల్ ఎనర్జీ) ద్వారా 1 కోటి రూపాయల ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఎంపికైన గ్రామం బిల్లులను దశలవారీగా అప్‌లోడ్ చేయడం ద్వారా ఈ నిధులు విడుదలవుతాయన్నారు. ఈ గ్రాంట్ మొత్తాన్ని గ్రామంలోని ఇతర మౌలిక వసతులు మరియు అభివృద్ధి పనుల కోసం ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లకు ఉచిత విద్యుత్ అందడంతో పాటు గ్రామానికి రూ. 1 కోటి అభివృద్ధి నిధులు వచ్చే అవకాశం ఉన్నందున, ఎంపిక చేసిన ఐదు గ్రామాల (నార్పల, యాడికి, కంబదూరు, రాప్తాడు, ఉరవకొండ) ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డిఆర్డిఏ పిడి శైలజ, నెడ్ క్యాప్ మేనేజర్ కిషోర్, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, డిపిఓ నాగరాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండో బెల్ట్ టెస్ట్ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు

మాస్టర్ కేశవ్ బండారి



**అంకుశం న్యూస్,అనంతపురం,సెప్టెంబర్:28:** అనంతపురం జిల్లా, స్థానిక జీసస్ నగర్ నారాయణ పాఠశాల ఆవరణంలో జరిగిన తైక్వాండో బెల్ట్ టెస్ట్ పరీక్ష కార్యక్రమం తైక్వాండో ప్రెసిడెంట్ గురుస్వామి ఆధ్వర్యంలో మరియు తైక్వాండో వైస్ ప్రెసిడెంట్ మణేంద్ర,సెక్రటరీ వెంకట్,జాయింట్ సెక్రెటరీ కేశవ బండారి సమక్షంలో ఈ బెల్ట్ టెస్ట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం లో విద్యార్థులకు బెల్ట్ టెస్ట్ పరీక్ష ను అనగా విద్యార్థినీ,విద్యార్థులు నేర్చుకున్న తైక్వాండో విద్యను పరీక్ష చేయడం జరిగింది. ఇందులో వామప్స్,సీటప్స్, పంచేస్,బ్లాక్స్, కిక్స్,స్టాండ్స్,కటస్,కుమితే పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్ష అనంతరం వలన కలుగు లాభాలను,ఉపయో గాలను మాస్టర్ కేశవ బండారి తెలియజేసారు. తైక్వాండో వలన ఆత్మరక్షణ,ఆత్మ విశ్వాసం,ఆత్మ ధైర్యం,శారీరక దృఢత్వం,మానసిక ఉల్లాసం,మేధాశక్తిని పెంపొందించే విధంగా ఆపద వచ్చినప్పుడు మనల్ని మనం కాపాడుకునే విధంగా తైక్వాండో ఉపయోగపడు తుందని చదువుతో పాటు తైక్వాండో కూడా మనకు చాలా అవసరమని తైక్వాండో క్రీడా గేమ్స్ లో ఉందని తైక్వాండో క్రీడా వలన మనకు స్పోర్ట్ కోటాలో కూడా మనకు మరెన్నో అవకాశాలు ఉన్నాయి అని తైక్వాండో గురించి వాటిలోని లాభాల గురించి విద్యార్థులకు తెలియజేసారు. అనంతరం ఉత్తీర్ణులైన 18 మంది విద్యార్థులకు బెల్ట్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కుమ్మరి వీధి గణేష్ మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనపర్తి కుమ్మరి వీధిలో బాల భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, దాతల సహకారంతో నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు స్వయంగా అన్న ప్రసాద వితరణ చేశారు. తదనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు,బ్యాండ్, డప్పు వాయిద్యాలు, కాళికా మాత వేషధారణలు, ఇంకా వివిధ విచిత్ర వేషధారణలు, యువత కేరింతలు, యువత డ్యాన్సులు నడుమ బాణాసంచా కాల్పులతో "గణపతి బప్పా మోరియా" అంటూ బొజ్జ గణపయ్యను పురవీధుల్లో ఊరేగించి నల్లకాలువలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కాగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## నవీన్ నిశ్చల్ ని శాలువాతో సత్కరించిన హిందూపురం జనసేన పార్టీ అధ్యక్షుడు కొల్లకుంట శేఖర్



**అంకుశం న్యూస్,హిందూపురం సెప్టెంబర్:28:** ఇటీవల జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిచ్చల్ ఆహ్వానం మేరకు తన స్వగృహం నందు మొదటిసారిగా మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం హిందూపురం జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కొల్లకుంట శేఖర్ నవీన్ నిశ్చల్ ని మర్యాదపూర్వకంగా శాలువా కప్పి సత్కరించి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకుల ఉమేష్ తో పాటు,నాయకులు,కార్యకర్తలు,వీర మహిళలు పాల్గొన్నారు.

## ఇంటికి కృతజ్ఞతలు తెలియజేసిన గోనిపేట ప్రజలు



**అంకుశం న్యూస్,అనంతపురం,సెప్టెంబర్:28:** పెనుకొండ నియోజకవర్గం పెనుకొండ రూరల్ మండలం,గోనిపేట గ్రామంలో మొబైల్ సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతూ ఉంటే 2024 ఎన్నికల ప్రచార సమయంలో తప్పకుండా సెల్ టవర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వగా ఇప్పుడు నూతన సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు కావడంతో హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కె పార్థసారధికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసిన గోనిపేట గ్రామ ప్రజలు.

## జంప్ రోప్ పోటీల్లో సత్తా చాటిన శ్రీ సత్యసాయి జిల్లా క్రీడాకారులు




**అంకుశం న్యూస్,పుట్టపర్తి, సెప్టెంబర్: 28:** పీలేరు సాయి బాబా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వేదికగా సెప్టెంబర్ 27,28 తేదీల్లో జరిగిన 8వ సబ్-జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జంప్ రోప్ ఛాంపియన్‌షిప్ -- ఏపీ 2026 పోటీల్లో శ్రీ సత్య సాయి జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. అలాగే టీమ్ ఈవెంట్‌లో ప్రథమ స్థానం సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ కార్యదర్శి నరసింహ నాయక్,కోచ్ హనీఫ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు క్రమశిక్షణతో,పట్టుదలతో సాధన చేసి ఈ ఘనత సాధించడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర,జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

## ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

**'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 337 అర్జీలు స్వీకరణ**



**అంకుశం ప్రతినిధిపుట్టపర్తి, సెప్టెంబర్ 28:** ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (గ్రా+వా) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 337 అర్జీలు రాగా, వాటిపై తగు చర్యలు తీసుకుని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ,ఎస్‌డిసి విజయ కుమారి తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జాషువా సాహిత్యంతో సామాజిక చైతన్యం : జయంతి సభలో మంత్రి దుర్గేశ్

**ఘనంగా జాషువా అవార్డుల ప్రదానోత్సవం**



అంకుశం ప్రతినిధివిజయవాడ, సెప్టెంబర్ 28 : మహాకవి గుర్రం జాషువా ఆశయ సాధనకు కృషి చేస్తామని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలో కళలకు, కళాకారులకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. గుర్రం జాషువా సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తెచ్చారన్నారు. సోమవారం రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య కళా వేదికలో ఘనంగా పద్మభూషణ్, కవిసామ్రాట్ గుర్రం జాషువా 131వ జయంతి సభ నిర్వహించారు. సాహితీవేత్తలు షేక్ కరీముల్లా, డాక్టర్ జాలాది విజయకుమారి, విల్సన్ రావు కొమ్మవరపు, గడ్డం ఈశ్వరమ్మ లకు నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు. జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేశ్ మాట్లాడారు. తన కవితలతో ప్రజల్లో జాషువా చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. తమ రచనలతో సామాజిక చైతన్యానికి కృషి చేసిన ఎందరో మహానుభావుల జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గుర్రం జాషువా గురించి భవిష్యత్తు తరాలకు వివరిస్తున్నామని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సృజనాత్మకత సాంస్కృతిక కమిషన్ ఛైర్ పర్సన్ పొడపాటి తేజస్వి, నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ, సిఈవో మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

## వై ఎస్ ఆర్ నేతలకు గుర్తింపు కార్డుల పంపిణీ



**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 28** ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి ఆదేశాలు మేరకు ధర్మవరం మాజీ మున్సిపల్ వైస్ వేముల జయరామి రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తమ పార్టీ కార్యాలయం లో ఐడి కార్డులను అందజేశారు. తమ పార్టీ అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఈ ఐడి కార్డులు అందజేశామన్నారు మున్సిపల్ ఎన్నికలలో వై ఎస్ ఆర్ సిపి పార్టీ తరుపున ప్రచారం చేస్తామన్నారు. జగన్ ఆశయాలు నిజం చేస్తామన్నారు.

## చేనేత డిజైనర్ కళాకారులు జూజారు నాగరాజు కు మంత్రి సత్య కుమార్ చేతుల మీదుగా సన్మానం



**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 28** జాతీయ అవార్డు గ్రహీత ధర్మవరం చేనేత డిజైనర్ కళా కారులు జూజారు నాగరాజు ను ధర్మవరం కళాజ్యోతి శత వార్షికోత్సవశీ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ సన్మానించిన చిత్రం ఈ కార్యక్రమం లో ధర్మవరం కళా జ్యోతి బృందం పాల్గొన్నారు

# గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం దాడి చేయడం అమానుషం

న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తే అక్రమ అరెస్టులు, కేసులతో వేధిస్తారా?

సచివాలయ వ్యవస్థను కుదిస్తూ ఉద్యోగులపై మరింత పని భారం మోపుతున్నారు

గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు,నోషనల్ ఇంక్రిమెంట్లు భేషరతుగా మంజూరు చేయాలి

పదోన్నతులపై స్పష్టత లేని జీవోలు విడుదల చేసి మరోసారి ఉద్యోగులకు మోసం

ఎమ్మెల్సీ వై శివరామరెడ్డి



**అంకుశం న్యూస్ ఉరవకొండ సెప్టెంబర్ 28** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు రాజ్యాంగబద్ధంగా, శాంతియుతంగా తమ సమస్యలను చెప్పుకోవడానికి విజయవాడకి వస్తే, వారిపై పోలీసులతో దాడిచేయించటం దుర్మార్గమని, ధర్నా చేస్తున్న మహిళా ఉద్యోగులను రోడ్డు మీద ఈడ్చుకొంటూ లాక్కుపోవటం అమానుషమని ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి పేర్కొన్నారు. ఉరవకొండ నియోజకవర్గం కొనకొండ్ల గ్రామంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగు లపై లాఠీ ఛార్జ్ చేయించడం అత్యంత దారుణమన్నారు. ఉద్యోగులపై ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? వందల మందిని అరెస్టు చేశారు.అక్రమంగా నిర్బంధించిన వందలాది మంది సచివాలయ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే బేషరతుగా విడుదల చేయాలి అని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు కూటమి పెద్దలు ఉద్యోగులకు అడుగడుగునా అండగా ఉంటామని చెప్పారు, అధైర్యపడొద్దని సూచించారు. అడుగడుగునా అండగా ఉండడమంటే వారి రాజ్యాంగ బద్ధమైన హక్కులను అణిచివేయటమా? అధైర్యపడద్దంటే లాఠీ చార్జ్ చేసి జైళ్లలో పడేయడమా? అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు.

**గ్రామ సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధిస్తున్నారా?**

వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెచ్చిన వ్యవస్థ కాబట్టి గ్రామ సచివాలయ ఉద్యోగులపై కక్ష సాధిస్తున్నారా? హార్ట్ఎటాక్ తో చిన్న వయసులోనే ఉద్యోగులు చనిపోతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం వేధింపులు,పని ఒత్తిడే. చిన్నచిన్న ఉద్యోగుల మీద ఈ స్థాయి ఒత్తిడి అవసరమా? రోజుకొక సర్వే పెట్టి వేధిస్తున్నారు. సర్వేలు, యోగాంధ్ర. పీ4 అంటూ సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తూ ప్రభుత్వం వారిని వేధిస్తున్నారు. ఉత్సవాలు జరిగితే టాయిలెట్ల దగ్గర కాపలా పెడుతున్నారు. పెట్రోలు కొరత రాగానే బంకుల దగ్గర కాపలా పెడుతున్నారు. ఇలా ప్రతిదీ వారికే అప్పగించి వేధిస్తున్నారు. పండుగలు, ఆదివారాలు కూడా లేకుండా అడ్డమైన పనులు చేయిస్తున్నారు. ఆఫీసులో లేకుండా రోడ్లవెంట తిప్పుతున్నారు. సచివాలయ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించటం దుర్మార్గం. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు మందులు, ఆహారం, ప్రభుత్వ సేవలు చేరవేయడంలో సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకంగా పనిచేసింది. ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయడం నుంచి సర్వేలు, వివిధ ప్రభుత్వ కార్యక్రమాల వరకు సచివాలయ ఉద్యోగులే ముందుండి పనిచేస్తున్నారు. అలాంటి వ్యవస్థను కుదించి ఉద్యోగులపై మరింత పనిభారం మోపడం సరికాదు. 15,004 సచివాలయాలను 7,715 కు కుదించే చర్యలపై ప్రభుత్వం పునరాలోచించాలి. సచివాలయ ఉద్యోగులను వివిధ శాఖల వారీగా పదోన్నతులు కల్పించాల్సింది పోయి వారికోసం సూపర్ న్యుమరి పోస్టులను సృష్టించి ప్రమోషన్లు కల్పిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేయడం కూటమి ప్రభుత్వం మరోసారి ఉద్యోగులను మోసం చేయటమేనని ఎమ్మెల్సీ విమర్శించారు. భేషరతుగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులందరికీ రాజ్యాంగబద్ధంగా రావలసిన పదోన్నతులు మరియు నోషనల్ ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగుల పక్షాన పోరాడటానికై వైయస్సార్సీపి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్సీ వై శివరామిరెడ్డి పునరుద్ఘటించారు.

# పేద కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచిన మంత్రి, చిన్నారి గుండె ఆపరేషన్‌కి ఆర్థిక సాయం

పాప ప్రాణం కోసం రోజంతా ఆసుపత్రిలో మంత్రి సుభాష్

ఆసుపత్రికి స్వయంగా వెళ్లి వైద్యులతో మాట్లాడిన మంత్రి సుభాష్

ఎల్ వో సి తో పాటు ఆపరేషన్ ఖర్చులు భరిస్తానని హామీ.. తల్లిదండ్రులకు భరోసా





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 28:** పుట్టిన నాలుగు నెలలకే తీవ్రమైన గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న చిన్నారికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పెద్దదిక్కుగా నిలిచారు. పేదరికంతో వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ.. ఆ చిన్నారి వైద్యానికి అవసరమైన పూర్తి సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ ఓ సి)తో పాటు ఆపరేషన్ కు అవసరమైన ఖర్చులు భరిస్తానని భరోసా కల్పించారు. పనులన్నీ పక్కనపెట్టి పాప ప్రాణం కోసం మంత్రి పడిన తాపత్రయం ఆయన మానవత్వానికి నిదర్శనం. వివరాల్లోకెళితే రామచంద్రపురం నియోజకవర్గం ద్రాక్షారామం శివారు చింతగుంట చెరువుకు చెందిన మేడిశెట్టి జీవన్ కుమార్- చంద్రిక దంపతుల నాలుగు నెలల చిన్నారి రియాన్సీ గ్రేస్ పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి తరచూ ఆయాసపడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో తల్లిదండ్రులు పలు ఆసుపత్రుల్లో చూపించారు. వైద్య పరీక్షల్లో చిన్నారి గుండెలో రంధ్రం ఉన్నట్లు గుర్తించిన ఆంధ్ర ఆసుపత్రి విజయవాడ వైద్యులు వెంటనే ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించారు. చిన్నారి రియాన్సీ గ్రేస్‌కు శస్త్రచికిత్స విజయవంతమై, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తూ ఆ కుటుంబానికి మంత్రి సుభాష్ అందిస్తున్న అండ, ఆప్యాయత వారికి కొత్త ధైర్యాన్ని ఇచ్చింది. ఇదే కదా నిజమైన మానవత్వం, సేవాగుణం అంటూ మంత్రి సుభాష్ పనితీరును ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# నిర్దిష్ట కార్యాచరణతో అభివృద్ధి వైపు పయనిద్దాం: ఎమ్మెల్యే కాలవ





**అంకుశం న్యూస్ రాయదుర్గం రిపోర్టర్ సెప్టెంబర్ 28** నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో రాయదుర్గం నియోజకవర్గాన్ని అన్ని విధాల ముందుకు తీసుకువెళతామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలో సోమవారం ఆయన స్వర్ణ ఆంధ్ర రాయదుర్గం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ... 2047 లక్ష్యంగా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల సమీక్షకు ఈ కార్యాలయం మూల కేంద్రం కాబోతోందన్నారు. ముఖ్యంగా 2047 నాటికి ఏ నియోజకవర్గానికి తీసిపోని విధంగా వెనుకబడ్డ రాయదుర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా ఆయా ప్రభుత్వ శాఖల్లో లోటుపాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకొంటూ శాఖల పనితీరు మెరుగుపరచుకోవాల్సి ఉంటుందన్నారు. పనితీరు సూచికలో రాష్ట్ర సగటు కంటే వెనుకబడ్డ శాఖలపై ప్రతినెల సంబంధిత అధికారులతో ఈ కార్యాలయంలో సమీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వెనుకబాటుకు కారణాలను సమీక్షించుకొంటూనే... దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలతో అభివృద్ధిని వేగవంతం చేసేలా ముందుకు వెళతామన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా మార్చాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం శ్రమిస్తూన్నారన్నారు. ఇందులో భాగంగా రూ.లక్ష కోట్ల వ్యయంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేయబోతున్నారన్నారు. రూ.30వేల కోట్ల కార్యాచరణకు కేంద్రం అనుమతి ఇవ్వడంతో అక్టోబర్ రెండవ తేదీన మదనపల్లిలో హార్టికల్చర్ హబ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు. ఆ హార్టికల్చర్ హబ్బులో రాయదుర్గం నియోజకవర్గ భాగస్వామ్యం పెంచేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతతో పాటు అదనపు నీటి వనరులతో రాయదుర్గం ప్రాంతంలో పండ్ల తోటలను విస్తృతంగా పెంచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జీడిపల్లి, బైరవానితిప్ప ప్రాజెక్టులను ఇందులో పొందుపరచడం జరిగిందన్నారు. వీటితోపాటు చిన్న చిన్న నీటి వనరులను కూడా సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన మేకలు, గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తామన్నారు. వీటితో పాటు గార్మెంట్స్ రంగాన్ని కూడా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ వివరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి,మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, మాజీ చేనేత డైరెక్టర్ టశీకశాల హనుమంతు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ యు హనుమంత రెడ్డి, సెంట్రల్ స్టోర్ అధ్యక్షుడు పూజరి శివ,మాజీ వైస్ చైర్మన్ కడ్డీపుడీ మహబూబ్ బాషా, బంగి శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# యువ క్రికెటర్లను ప్రోత్సహించడమే ఆర్డిటి ధ్యేయం

గ్రామీణ వర్గాలకు వృత్తి నైపుణ్య శిక్షణే లక్ష్యం --

మచ్చా రామలింగారెడ్డి -- ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్





**అంకుశం న్యూస్ గుత్తి అనంతపురం సెప్టెంబర్ 28** యువ క్రికెటర్లను ప్రోత్సహించడమే లక్ష్యంగా వారిలో ఉన్నటువంటి నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి మంచో ఫెర్రర్ నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అందులో ప్రతి ఒక్కరూ యువ క్రికెటర్లు భాగస్వాములై ఉపయోగించుకోవాలని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ పిలుపునిచ్చారు గ్రామీణ ప్రాంతాల్లో వర్ధమాన క్రికెట్ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించి, మద్దతు ఇవ్వడం ద్వారా గ్రామీణ వర్గాలకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించడమే ఆర్‌డిటి లక్ష్యమని, ఇందుకోసం వనరుల వినియోగం, నిరంతర సాధన ఆవశ్యకతను నొక్కి చెబుతున్నామని ఆర్‌డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. గుత్తి పట్టణంలోని రైల్వే గ్రౌండ్ నందు ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభమైందిఈ కార్యక్రమంలో మచ్చా రామలింగారెడ్డి ప్రసంగిస్తూ, ఆర్‌డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ గురించి వివరించారు. ఆటగాళ్ల అభివృద్ధికి నిరంతర సాధన చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు; ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రోత్సహించారు. తదుపరి దశల కోసం ఎంపికలు, మ్యాచ్‌లు, ఫిట్‌నెస్ శిక్షణ ద్వారా అభ్యర్థులను గుర్తిస్తామని ఆయన తెలిపారు. . ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న తల్లిదండ్రులకు మరియు పీఈటీఎస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియలో సెలెక్టర్లు వెంకటేష్ విజయరాజు రఫీ నరేంద్ర డి. ఆర్డీటీ కోఆర్డినేటర్ ప్రవీణ్ గుత్తి క్రికెట్ కోచ్ మహేష్, సీనియర్ క్రికెటర్లు మహిళా క్రికెటర్లు పాల్గొన్నారు. ఎంపిక కమిటీ వర్షం తగ్గే వరకు వేచి చూసినప్పటికీ, వాతావరణం ప్రక్రియకు అంతరాయం కలిగించి, పిచ్ పరిస్థితులను దెబ్బతీసింది; ఫలితంగా, ఎంపికలు వాయిదా పడ్డాయి మరియు కొత్త తేదీని తగిన సమయంలో తెలియజేయడం జరుగుతుంది.

## స్వర్ణ నంది అవార్డు -- సేవా ప్రస్థానానికి గుర్తింపు మాజీ బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎన్నిక





**అనంతపురం అంకుశం న్యూస్ సెప్టెంబర్ 28** తాడిపత్రి ప్రాంతానికి చెందిన బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు జంగం రెడ్డి అంకాల్ రెడ్డి నంది అవార్డుకు ఎంపికయ్యారు. 1993 సంవత్సరం నుండి ఆధ్యాత్మిక, సామాజిక ప్రజాసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ తన సేవా ప్రస్థానాన్ని కొనసాగించారు. శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామి దర్శనం కోసం శివమాల ధరించి, పాదయాత్రలో పాల్గొంటూ "శివ... శివ..." అనే నామస్మరణతో భక్తి మార్గంలో ముందుకు సాగారు. 1995 సంవత్సరం నుండి భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, పార్టీకి సంబంధించిన వివిధ బాధ్యతలు పదవులను నిర్వహించారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజలతో నిరంతరం మమేకమై, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా తనదైన సేవా ముద్రను ఏర్పరచుకున్నారు. ఆధ్యాత్మిక విశ్వాసం, దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాసేవ నిరంతర కృషిని సమన్వయం చేసుకుంటూ సాగిన ఆయన సేవా ప్రయాణాన్ని గుర్తించి, ఆయన చేసిన విశిష్ట సేవలకు గౌరవంగా "స్వర్ణ నంది అవార్డు" కు ఎన్నికయ్యారు. ఈ అవార్డు కేవలం ఒక వ్యక్తికి అందించిన పురస్కారం మాత్రమే కాదు --- దశాబ్దాలుగా కొనసాగుతున్న సేవా సంకల్పానికి, ఆధ్యాత్మిక నిబద్ధతకు, ప్రజల పట్ల ఉన్న బాధ్యతకు సమాజానికి చేసిన సేవలకు లభించిన గౌరవం. ఒక సందేశం

"భక్తి మనకు ఆధ్యాత్మిక శక్తిని ఇస్తుంది... సేవ మన జీవితానికి అర్థాన్ని ఇస్తుంది... నిబద్ధత మన ప్రయాణానికి విజయాన్ని అందిస్తుంది." శ్రీ జంగం రెడ్డి అంకా ల్ రెడ్డి సేవా ప్రస్థానం యువతకు సమాజ సేవ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక స్ఫూర్తిదాయకమైన ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ, స్వర్ణ నంది అవార్డు అందుకున్న సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని అంకా ల్ రెడ్డి తెలిపారు.

## ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు



**అంకుశం న్యూస్,హిందూపురం,సెప్టెంబర్:28 :** హిందూపురం పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహానికి అఖిల భారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా 119వ జయంతి సత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కమల్ భాష అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనిశెట్టిపల్లి వినోద్ కుమార్,డి.దాదాపీర్ హాజరై మాట్లాడటం జరిగింది.నేటి యువత భగత్ సింగ్ ఆశయాల కోసం పనిచేయాలని అతి చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను గడ్డిపోచులా భావించి దేశం కోసం వీర మరణం పొందిన భగత్ సింగ్ ఎంతోమంది యువతకు ఆదర్శప్రాయమని కొనియాడారు.ఏదైతే రవి హస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడ లాడించిన యువకిశోరం భగత్ సింగ్ అని తెలిపారు.అలాగే 1917 సంవత్సరం సెప్టెంబర్ 28వ తేదీన జన్మించిన భగత్ సింగ్ 1931 మార్చి 23వ తేదీన తన సహచరులైన రాజ్ గురు,సుఖదేవులతొ కలిసి ఉరికంబాలను ముద్దాడిన వీర యోధులు భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ అని కొనియాడారు.భగత్ సింగ్ చిన్నప్పటి నుండి తన తాత గారి నుండినే స్వాతంత్ర కాంక్షను రగిలింది.ప్రభుత్వాలు వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు మరియు నిరుద్యోగ భృతి విడుదల చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాబిర,జ్యోతి,ఆటో యూనియన్ పట్టణ కార్యదర్శి నౌషాద్,శ్రీనివాసులు, లింగప్ప, లక్ష్మీనారాయణ,మంజునాథ్, ప్రసాద్,రామాంజనేయులు,అంజి పాల్గొన్నారు.

## డిమాండ్లనుఅరచేతిపైరాసి శాంతియుత నిరసన



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 28:** ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపు మేరకు 30 రోజుల శాంతియుత నిరసనలలో భాగంగా ఈరోజు అనపర్తి ఏరియా హాస్పిటల్ లో అరచేతి మీద కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని రెగ్యులర్ చేసేంతవరకు 100% గ్రాస్ శాలరీ చెల్లించాలన్న డిమాండ్లను రాసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియోగ్రాఫర్ విజయకుమార్ కౌన్సిలర్ చైతన్యరాజు ఎలక్ట్రీషియన్ నౌషద్ నర్సింగ్ ఆఫీసర్స్ అమ్మాజీ రామలక్ష్మి స్వాతి వసంత ఇందిరా కీర్తి తదితరులు పాల్గొన్నారు

## బంగాళాఖాతంలో మరో వాయుగుండం.. ఏపీకి వర్ష సూచన...

వాతావరణ శాఖ అధికారులు తెలిపారు....



**అంకుశం న్యూస్, ఆంధ్రప్రదేశ్, సెప్టెంబర్:28** బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడింది. మయన్మార్-అండమాన్ మధ్య ఇది ఏర్పడినట్లూ వాతావరణశాఖ తెలిపింది.రాగల 12 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. ప్రస్తుతం అండమాన్‌లోని మాయాబందర్‌కి 580 కి.మీ దూరంలో తూర్పు ఈశాన్యంగా కేంద్రీకృతమై ఉత్తర వాయవ్యంగా బంగ్లాదేశ్ వైపు పయనిస్తోంది. 72 గంటల్లో ఈశాన్య బంగాళాఖాతం-బంగ్లాదేశ్ మధ్య ఇది తీరం దాటే అవకాశముంది. వాయుగుండం ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశముంది.గంటకు 30-40 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలే బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడి కళింగపట్నం వద్ద తీరం దాటిన సంగతి తెలిసిందే. దాని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి.